# "వానపాము కాటేసింది"

కాలింగ్ బెల్ మోగింది.

వంటగదిలో పనిచేసుకుంటోన్న కామేశ్వరి... చేతిలో పని వదిలేసి హాల్లోకి వచ్చి... వీధి తలుపు తీసింది. ఎదురుగా చేతిలో సూట్‌కేస్‌తో మాలతి... ఆవిడ కళ్ళు ఆశ్చర్యంగా, ఆనందంగా మెరిశాయి. "ఏవిటమ్మా ఈ రాక... ఇంత అకస్మాత్తుగా... అల్లుడేడి?" కూతురి చేతిలో సూట్‌కేస్ అందుకుంటూ ఆప్యాయంగా అడిగింది.

మాలతి చిరునవ్వు నవ్వుతూ అన్నది... "నన్ను లోపలికి రానివ్వవా ఆయన లేకపోతే"

ఆవిడ గుమ్మానికి అడ్డం జరిగి "రామ్మా" అంటూ లోపలికి దారితీసింది.

"నాన్నగారు అప్పుడే ఆఫీస్‌కెళ్ళారా? నీలు కాలేజీకెళ్ళిందా?" మాలతి నిశ్శబ్దంగా ఉన్న ఇల్లు కలియచూస్తూ అడిగింది.

"వాళ్ళిద్దరూ వెళ్ళి అరగంటైంది. దా... మొహం కడుక్కో కాఫీ ఇస్తాను" వంటగదిలోకి దారితీసింది.

మాలతి నేరుగా బాత్‌రూమ్ వైపు వెళ్ళింది.

కామేశ్వరి చిక్కటి ఫిల్టర్ డికాక్షన్‌తో కాఫీ కలిపి వెచ్చబెట్టింది.

"ఏవిటమ్మా విశేషాలు... నీ ఆరోగ్యం ఎలా ఉంది?" కాఫీ తాగుతూ అడిగింది మాలతి.

"నా ఆరోగ్యానికేం... నిక్షేపంలా ఉన్నాను. నువ్వేంటి అలా చిక్కిపోయావు? ఆ కళ్ళకింద నల్లగా అలా ఉందేం... విశేషం ఏవన్నా ఉందా?"

మాలతి చిన్నగా నవ్వి అన్నది..."ఏంలేదమ్మా... మీ అందరి మీదా దిగులు అంతే"

"అందుకేనా... ఇలా అకస్మాత్తుగా ఊడిపడ్డావు. మీ అత్తగారు, మావగారు,

ఆడపడుచూ బాగున్నారా? అల్లుడు నిన్ను బాగా చూసుకుంటున్నాడా?"

'ఆ' తల్లి ప్రశ్నలకి ముక్తసరిగా సమాధానం చెప్పి పెరట్లోకి నడిచింది మాలతి.

పచ్చపచ్చగా కళకళ్లాడుతున్న మొక్కల్ని చూస్తుంటే మాలతి మనసు అనిర్వచనీయమైన ఆనందంతో నిండిపోయింది.

ఇవన్నీ తనూ, నీలూ కలిసి నాటిన మొక్కలు. అన్నీ కూడా పచ్చగా ఉండి ఫలాలనిస్తున్నాయి. పూలమొక్కలన్నీ పరిసరాలను పరిమళింపచేస్తున్నాయి.

తనూ... నీలూ ఈ ఇంటి నుంచి... అమ్మానాన్నల నుంచి దూరమైనా తామిద్దరి గుర్తుగా ఈ మొక్కలు కలకాలం ఉండిపోతాయి అని రకరకాల మొక్కల్ని ఏరికోరి తెచ్చి నాటారు.

"అన్నంలోకి ఏం చేయను మాలా?" కామేశ్వరి స్వరం విని ఆలోచనల నుంచి తెప్పరిల్లి చూసింది మాలతి.

"కందిపచ్చడి చేయమ్మా... చాలాకాలమైంది తిని."

"అలాగే... నువ్వు కూర్చుని కబుర్లు చెప్తుండు... నేను అరగంటలో నీకు కంది పచ్చడి, సాంబారు... మునక్కాడల కూరతో అన్నం వడ్డిస్తాను.

మాలతి తల్లి ప్రశ్నలన్నిటికీ అంటీ అంటనట్టు సమాధానాలు చెప్తూ గడిపేసింది.

అన్నం తిన్నాక బాగా నిద్రొచ్చింది.

అమ్మ చేతి వంట... చాలాకాలం తరువాత కడుపునిండా భోంచేయడంతో ఒళ్ళు తెలీని నిద్రతో నాలుగైనా మెలకువ రాలేదు.

నీలిమ హడావుడితో నాలుగున్నరకి లేచింది.

వెలిగిపోతున్న మొహంతో నీలిమ "ఎన్నాళ్ళైందక్కా నిన్ను చూసి" అంటూ అమాంతం కావలించుకొంది.

ఆ తరువాత నీలిమ కబుర్లు, నవ్వులు వీటి మధ్య రామారావు ఆఫీసు నుంచి వచ్చిందాకా కాలక్షేపం అయింది. ఆ రాత్రి అమ్మానాన్న, చెల్లి వీళ్ళందరితో కూర్చుని కబుర్లు చెప్తూ అన్నం తింటోన్న మాలతి కళ్ళు చెమర్చాయి. ఎన్నాళ్ళైంది ఇలాంటి ఆహ్లాదకరమైన వాతావరణంలో గడిపి. కోపాలూ... తాపాలూ... చీదరింపులూ... వెటకారాలు... పెళ్ళి అయిన దగ్గర్నించీ మనిషినన్న విషయమే మర్చిపోయింది.

అత్తగారికి డబ్బు దాహం... ఆడపడుచుకి ఆశదాహం. మావగార్కి సేవల దాహం... భర్తగారికి స్వార్థం. ఒక కుటుంబంలో నాలుగు రకాల మనస్తత్వాలతో నొప్పించక తానొవ్వక మసలుకోవడం కత్తిమీద సాము.

మాలతి నవ్వుతున్నా అప్పుడప్పుడూ ఆమె మొహంలో తాట్లాడుతున్న నీలినీడలు నీలిమ దృష్టి నుంచి తప్పించుకోలేకపోయాయి.

రాత్రి కాగానే అక్కగార్ని తీసుకొని డాబా మీదకెళ్ళింది. చాప పరుచుకుని పడుకుని వెన్నెల జల్లుల్ని చూస్తూ అడిగింది నీలిమ... "ఇప్పుడు చెప్పు... ఇంత అకస్మాత్తుగా రావడానికి కారణం ఏమిటి?"

మాలతి బలవంతంగా నవ్వి– "మిమ్మల్నందర్నీ చూడాలనిపించి" అన్నది.

నీలిమ మాలతి కళ్ళల్లోకి చూస్తూ "అంతేనా!" అన్నది. మాలతి కళ్ళు వాలిపోయాయి. గుండెల్లో దాచుకున్న మంచుపర్వతం కరిగినట్లైంది.

చెల్లెలి గుండెల్లో తలదాచుకుని వెక్కివెక్కి ఏడ్చింది.

కొన్ని నిమిషాలు గడిచాక నీలిమ అడిగింది...

"మనసు తేలికైందా కాస్త... ఇప్పుడు చెప్పు..."

మాలతి మెల్లగా అన్నది– "నీలూ! నాకు కట్నాల పెళ్ళిళ్ళు ఇష్టం లేకపోయినా అమ్మానాన్నల కోసం శేఖర్‌కి నలభైవేలు కట్నం ఇస్తున్నా మౌనంగా ఉండిపోయాను. పెళ్ళిలో అలకపాన్పు మీద స్కూటర్ కావాలంటే, నాన్న తను కొనుక్కున్న కొత్త స్కూటర్ ఇచ్చేసినా మాట్లాడలేదు నేను. ఎబిసి వలలో చిక్కుకుని ఉద్యోగం ఊడగొట్టుకుని ఈ రెండేళ్ళుగా నా వంటిమీద నగలన్నిటికీ స్థానచలనం కల్పించినా ఏం మాట్లాడలేదు.

మొగుడికి ఉద్యోగంలేదని... అత్తయ్యా, మావయ్యా... సుధా నన్ను ఇంట్లో పనిమనిషిలా చూసినా నా ఖర్మ ఇంతే అని సరిపెట్టుకున్నాను. కానీ... కానీ..." మాలతి కంఠం దుఃఖంతో రుద్ధమైంది.

"కానీ..." నీలిమ కళ్ళు చిట్లించింది.

"ఆయన వ్యాపారం చేస్తారుట... పెట్టుబడికి యాభైవేలు కావాలిట. అది తెస్తే కానీ తిరిగి రావద్దని నన్నిక్కడికి పంపించారు నీలూ! రెండేళ్ళుగా నేను మనింటికి కేవలం ఒక్కసారి మాత్రం వచ్చాను కదా! ఎందుకో తెలుసా? నేను ఇక్కడకు వస్తే అక్కడ వాళ్ళకు సేవలు చేసేవాళ్ళుండరని నన్ను పంపేవారు కాదు. అప్పుడు కూడా ఇలాగే డబ్బు కోసం పంపించారు. కానీ నాన్నగార్ని

అడగటం ఇష్టంలేక వెళ్ళిపోయాను. అక్కడికెళ్ళాక నాకు జరిగిన మర్యాదలు ఇన్నీ అన్నీ కావు. అవన్నీ తల్చుకుంటే భయం వేస్తోంది. ఇప్పుడు ఈ విషయం నాన్నగారితో ఎలా ప్రస్తావించాలో తెలీడంలేదు. డబ్బు లేకుండా వెళ్తే వాళ్ళు ఏం చేస్తారో అని భయం"

"నువ్వసలు వెళ్ళద్దు" ఆవేశంగా అన్నది నీలిమ.

"నీలూ!"... ఆదుర్దాగా పిలిచింది మాలతి.

"అవునక్కా... నువ్వు వెళ్ళద్దు... నాన్నతో నేను మాట్లాడతాను. ఛీ... ఛీ... మనుషుల మనసులతో వ్యాపారం చేసేవాళ్ళు మనుషులు కారు. ఇంత నీచులా వాళ్ళు... ఇంతకాలం నుంచీ బావగారికి నామీద పిచ్చి ప్రేమ... నన్ను విడిచి ఒక్క రోజు కూడా ఉండలేరు. అని నువ్వు చెప్తోంటే నిజం అనుకున్నాను."

"హు..." విరక్తిగా నవ్వింది మాలతి.

"అలా చెప్పక ఏం చెప్పను? అసలు సంగతి చెప్పి మీ మనసుల్లో అశాంతి రేపనా? నేను సుఖంగా ఉంటే మీరంతా సుఖంగా ఉంటారని కదా!"

"ఆ... ఉన్నావుగా చాలా సుఖంగా" వెటకారంగా అంది నీలు.

ఆ రాత్రి అక్కాచెల్లెళ్ళిద్దరూ ఎవరి ఆలోచనల్లో వారు కలత నిద్ర పోయారు.

మర్నాడు అందరూ కాఫీలు తాగి తీరిగ్గా కూర్చుని ఉండగా నీలిమ అన్నది తండ్రితో "నాన్నా! అక్కకేదన్నా ఉద్యోగం చూడాలి"

రామారావు ఆశ్చర్యంగా చూశాడు. "అక్కకి ఉద్యోగమా?"

"అవును నాన్నా... అక్క ఇంక అక్కడికెళ్ళదు. ఇక్కడే ఉద్యోగం చేసు కుంటూ బతుకుతుంది."

"నీకేమన్నా మతిపోయిందా ఏమిటి... ఏం జరిగింది?" కంగారుగా అడి గింది కామేశ్వరి.

"ప్రస్తుతానికేం జరగలేదమ్మా... ఇంకా కొన్నాళ్ళు ఆగితే అక్కని వాళ్ళు చంపేస్తారు."

"నీలూ!" కోపంగా అరిచాడు రామారావు.

"నాన్నా..." ఆవేశపడవద్దు. నేచెప్పేది వినండి" అంటూ నీలిమ రాత్రి మాలతి తనకు చెప్పిన విషయాలన్నీ చెప్పింది.

అంతా విన్న రామారావు, కామేశ్వరి నిశ్చేష్టులయ్యారు.

మాలతి నిశ్శబ్దంగా రోదిస్తోంది.

కొంతసేపు గడిచాక... బలహీనమైన స్వరంతో అన్నాడు రామారావు "ఇన్ని బాధలు పడుతూ నన్ను దబ్బుడగటానికి మొహమాటపడ్డావా మాలతీ! నా ఈ సంపాదన... ఇదంతా మీకోసం కాదా తల్లీ!"

"కావచ్చు నాన్నా! అలా అని వాళ్ళడిగిందల్లా ఇచ్చేస్తారా? ఇవాళ్టి ఈ కోరికలన్నీ రేపు బ్లాక్‌మెయిల్‌గా మారతాయి. పదివేల తోటి... యాభైవేల తోటీ తృప్తిపడి అక్కను బాగా చూసుకుంటారనా! అలాంటివాళ్ళే అయితే అసలు అడగనే అడగరు"

"అయితే ఏవిటంటావే... డబ్బు కోసం దాని కాపురం కూల్చి... దాన్ని మొగుడ్నొదిలి రమ్మంటావా?" కోపంగా అంది కామేశ్వరి.

"కొన్నాళ్ళు అక్క వాళ్ళని కేర్ చేయకుండా ఉంటే వాళ్ళే దారికొస్తారమ్మా"

"చాల్లే... నీ బోడి తెలివితేటలు ప్రదర్శించకు. నిర్లక్ష్యం చేసిన ఆడదాన్ని ఏ మొగుడు మళ్ళీ రానిస్తాడు? సంసారం అన్నాక లక్షాతొంభై ఉంటాయి. ఆ మాత్రానికి ఇలా వదిలేస్తారా? మాలతీ రేపే డబ్బు తీసుకొని నువ్వు బయల్దేరు. అతను రేపు వ్యాపారంలో లాభాలు గడిస్తే అనుభవించేది నువ్వు కాదూ..."

"అమ్మా..." ఆవేదనగా పిలిచింది మాలతి. "నేను వెళ్ళనమ్మా! నీకు తెలీదు వాళ్ళ సంగతి"

"చూడమ్మా... నీకు ఇలాంటి మనుషులతో అనుభవం లేదు కాబట్టి ఇలా భయపడుతున్నావు. కొన్నాళ్ళు ఇలా సాధించటం మామూలే. పాతబడ్డాక మొత్తం అందరి మీదా అధికారం నీకే వస్తుంది. నామాట విని రేపే బయల్దేరు. ఏవండీ! డబ్బు రెడీ చేయండి."

"అలాగే కామేశ్వరీ!"

నీలిమా, మాలతి నిస్సహాయంగా ఒకర్నొకరు చూసుకున్నారు.

***

మాలతి వెళ్ళిపోయిన కొంతకాలం బాగానే గడిచింది. ఒక్క ఉత్తరం మాత్రం తల్లీతండ్రికి రాసింది. ఆ తరవాత ఉత్తరాలు రాసే తీరిక దొరకలేదు. ఇంటెడు చాకిరీతో అలసిపోయేది. శేఖర్ ఏం బిజినెస్ ప్రారంభించాడో తెలీదు. రోజూ ఉదయం వెళ్ళటం... రాత్రి పొద్దుపోయాక రావడం. భార్యాభర్తల మధ్య ఓ అరగంట కూడా సంభాషణ సాగేది కాదు.

ఓరోజు హఠాత్తుగా శేఖర్ అరెస్ట్ అయ్యాడన్న వార్త వింది మాలతి.

అతను చేస్తున్న ఫైనాన్స్ వ్యాపారం దెబ్బతింది.

మాలతికి ఏంచేయాలో తోచలేదు.

అది చాలా మామూలు విషయంగా నిమ్మకు నీరెత్తినట్టు కూర్చున్న మావ గార్ని... బెయిల్ మీద విడిపించమని బ్రతిమాలింది. బెయిల్‌కి కోర్టు ఖర్చులకి యాభైవేలు తెమ్మన్నాడాయన. మాలతి ఏడ్చింది... బ్రతిమాలింది. ఎవరూ కూడా కరగలేదు. పైపెచ్చు ఆమెనే దరిద్రమొహంగా అభివర్ణించారు.

మాలతి తన దగ్గర మిగిలి ఉన్న ఒకే ఒక్క నగ, చంద్రహారం అమ్మి భర్తని విడిపించింది.

మళ్ళీ శేఖర్ ఖాళీగా తిరగడం ప్రారంభించాడు.

మాలతి కష్టాలు పెరిగాయి.

ఓరోజు భర్తని అడిగింది తనకి ఉద్యోగం చూడమని. ముందు శేఖర్ మండిపడ్డా తరువాత ఆలోచించి మాలతి ఉద్యోగం చేయడానికి ఒప్పుకున్నాడు.

ఇరవైరోజులు కష్టపడ్డ తరువాత ఓ ప్రైవేటు స్కూల్లో టీచర్‌గా ఉద్యోగం దొరికింది. నెలకి ఐదువందలు జీతం.

మాలతి మనసు శాంతించింది.

మావగారి సంపాదన మీద తిండికి ఆధారపడక్కర్లేదు అనుకుంది. ఆమెలో కొద్దిగా ఆత్మవిశ్వాసం పెరిగింది.

అత్తగారి పట్లా... మావగారి పట్లా గౌరవం ప్రదర్శిస్తూనే కొంత తిరుగు బాటు ధోరణి అలవాటు చేసుకుంది.

కోడలిలో వచ్చిన మార్పు సుభద్రమ్మను కలవరపెట్టింది. తన చేయి దాటిపోతోందన్న ఆందోళన మొదలైంది ఆవిడలో.

"బోడి ఐదువందలు కూడా సంపాదననేనా. ఒకపూట తిండికి చాలదు. ఈమాత్రానికి ఈవిడగారు ఎగిరి పడుతోంది. ముష్టి ఉద్యోగం మానిపించేయరా" అంది కొడుకుతో.

శేఖర్ ఆ విషయంలో మాత్రం తల్లి మాట వినలేదు. అతని ఆలోచన వేరుగా ఉండడమే అందుకు కారణం.

"ఇంటికి బాగా దగ్గర కదమ్మా స్కూలు. నడిచివెళ్ళి రావచ్చు. రోజుకి

మూడు గంటలు. ఇంట్లో పనికి ఇబ్బందిలేకుండా చూసుకుంటుందిలే వెళ్ళనీ" అన్నాడు.

మాలతి రోజూ ఐదింటికే లేచి వంట, వార్పూ పూర్తి చేసుకొని స్కూల్‌కి వెళుతుంది. తిరిగివచ్చి మళ్ళా పని... పని ఎక్కువైనా అలసటగా అనిపించడలేదు. తను సంపాదన పరురాల్ని అయానన్న ఆనందంతో మిగతా విషయాలు ఆమె నంతగా బాధించలేదు.

మొదటి నెల పూర్తవుతుండగా జీతం అందుకోబోయే క్షణం కోసం ఎంతో ఎదురు చూసింది. ఐదువందలు చేతిలో కనిపించగానే గుండెనిండా సంతోషం... కళ్ళనిండా కాంతులు నింపుకొని స్కూల్ ఆవరణ దాటి బైటికొచ్చిన మాలతి నిశ్చేష్టురాలైంది. ఎదురుగా శేఖర్... "ఇవాళ జీతం వచ్చినట్టుంది" చేయి చాపాడు.

మాలతి చేష్టలుడిగి అతణ్ణే చూస్తూండిపోయింది.

"ఇవ్వు" గద్దించాడు.

మౌనంగా తన కష్టార్జితం ఐదువందలు అతని చేతిలో పెట్టింది.

కన్నీళ్ళు నిగ్రహించుకుని ఇంటికి పరిగెత్తింది.

తలగడలో మొహం దాచుకుని కుళ్ళికుళ్ళి ఏడుస్తోన్న మాలతికి మావగారి స్వరం కటువుగా విన్పించింది.

"ఇవాళ నీ కోడలికి జీతం వచ్చింది. డబ్బులడిగి తీసుకో. తనది... తన మొగుడిదీ తిండికి సరిపడా నెలకి ఎంత అవుతుందో లెక్కచేసి ఇవ్వమను."

అత్తగారి స్వరంలో హేళన. "ఆ ఇస్తుంది ముష్టి ఐదొందల్లో ఆవిడగారి కాఫీ ఖర్చు రాదు."

మాలతి మనసునిండా తుమ్మముళ్ళు పరిచిన బాధ.

రోజులు గడుస్తున్నాయి. యాంత్రికమైన ఆమె జీవితంలో మార్పేమీ లేదు. శేఖర్ తాగుడికీ... పేకాటకీ మాలతి జీతం ఖర్చు పెడుతున్నాడు.

"మీరేదన్నా వ్యాపారం చేయచ్చుగా సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ స్కీం కింద లోన్ తీసుకుని" ఓరోజు అంది మాలతి.

"మీ నాన్న సెక్యూరిటీ ఇస్తానంటే అలాగే చేస్తా" అన్నాడు.

మాలతి కడుపు మండిపోయింది. కూతుర్నిచ్చినందుకు జీవితాంతం అల్లుణ్ణి పోషించాలా ఆయన. ఏం మనిషి? అన్నిటికీ మావగారే లోకువ.

"ఇంకా నాకో చెల్లెలుంది. దానిక్కూడా పెళ్ళి చేయాలి మా నాన్న" కొంచెం విసురుగా అంది.

"ఏం ఫర్వాలేదు అంతగా అయితే దాన్ని కూడా నేనే చేసుకుంటా... మీ నాన్నని ఆస్తి రాసిచ్చేయమను."

"షటప్" మాలతి అప్రయత్నంగా అరిచింది.

"ఏమన్నావే..." చెంప ఛెళ్ళుమంది.

"నన్ను నోర్ముయ్యమంటావా... జాగ్రత్త... చీరేస్తాను" విసురుగా వెళ్ళిపోయాడు.

మాలతి వెక్కివెక్కి ఏడ్చింది.

ఆ రాత్రి... అత్తగారి గదిలోంచి విన్పిస్తోన్న మాటలు అనుకోకుండా మాలతి చెవిన పడ్డాయి.

వెటకారానికి అన్నాడనుకున్న శేఖర్ మాటలు నిజం చేయాలన్న ప్రణాళికకి ఆ గదిలో అంకురార్పణ జరుగుతోందని అర్థమైంది. ఆమె ఆపాదమస్తకం కంపించింది.

నో... నో... అలా జరక్కూడదు.

నీలిమ జీవితం నాశనం అవకూడదు.

నీలు తెలివైంది... వీళ్ళ ఆటలు దాని దగ్గర సాగవు. కానీ... వీళ్ళ భయంకరమైన తెలివితేటల ముందు అదేపాటి. బెదిరించో బ్లాక్‌మెయిల్ చేసో వీళ్ళు నీలిమని ఈ నరకం లోకి లాగుతారా? అమ్మో!

మాలతికి నిద్రపట్టలేదు.

వారం రోజులు ఏకధాటిగా ఆలోచించిన  మాలతి ఒక నిర్ణయానికి వచ్చింది.

ఆరోజు... ఇంటికి బంధువులొచ్చారు. మాలతి స్కూల్‌కి లీవ్ లెటర్ పంపించింది పని తెమలక.

వంట... టిఫిన్లు... కాఫీలు... వంటింట్లోంచి బైటికి రావడానికి ఒక్క క్షణం తీరిక దొరకలేదు.

గిలకలా తిరుగుతూ పనిచేస్తున్నా, ఆమె మెదడులో ఆలోచనలు సుళ్ళు తిరుగుతూనే ఉన్నాయి.

అత్తగారు బంధువుల ముందు మాలతిని ఎంతో ఆప్యాయంగా చూస్తున్నట్లు నటిస్తోంది.

ఆ రాత్రికి అందరూ వెళ్ళిపోయారు.

అలసిపోయిన ఆమె హాల్లో కూర్చుని కునికిపాట్లు పడుతోంది. ఇంకా శేఖర్ ఇంటికి రాలేదు.

అత్తగారి గదిలోంచి గుసగుసలు...

మాలతి సభ్యత కాదనుకుంటూనే కిటికీ దగ్గరకి నడిచింది.

"మీరూరుకోండి... తలుపులు వేసేసి నోట్లో గుడ్డలు కుక్కితే శబ్దం బైటికి రాదు. మన పని మనం చేద్దాం. రెండు లీటర్ల కిరసనాయిలు పోతే పోయింది. శ్యామల కూతుర్ని చేసుకుంటే రెండు లక్షలిస్తానంది."

"వద్దే... ఆ తరువాత పోలీస్ కేసు... అరెస్టులు... దానికి పిల్లల్లేరని కేసు పెట్టి... విడాకులు ఇమ్మందాం. అయినా మనవాడికి నీలిమ మీద మనసుంది. విడాకులిస్తే దీని బతుకు బజారుపాలవుతుందని భయపడైనా కిక్కురుమనకుండా దీని చెల్లెల్ని ఇస్తారు. మగపిల్లల్లేరు కాబట్టి ఆస్తి మనకే వస్తుంది."

"మీ బుర్ర కూడా ఇంత బాగా ఆలోచిస్తుందా? సరే... అదేదో రేపే వెళ్ళి లాయర్ని కలవండి. దీని పీడ వదలనైనా వదలాలి... లేదా దీని చెల్లెల్ని ఆస్తితోసహా ఇక్కడికి తీసుకురావాలి."

మాలతి నిలువెల్లా వణికిపోయింది.

ఆ వెంటనే వెళ్ళి... వణికే చేతుల్తో నీలిమకి ఉత్తరం రాసింది.

పది రోజులు గడిచాయి.

శేఖర్ కొన్ని కాగితాలు తీసుకొచ్చాడు. అతని వెనుకే అతని తల్లి, తండ్రి, చెల్లెలు. మాలతి స్వెట్టర్ అల్లుతోంది. తనముందు పెట్టిన కాగితాల వైపు చూసింది తలెత్తి.

"ఏమిటివి?" అడిగింది.

"విడాకుల కాగితాలు. సంతకం పెట్టు" తీవ్రంగా అన్నాడు.

"విడాకులా! దేనికి?" అడిగింది.

"పెళ్ళై మూడేళ్ళు దాటుతున్నా పిల్లల్లేరు. గొడ్డుబోతుదాన్ని కోడలిగా చేసుకున్న పాపానికి ప్రాయశ్చిత్తం చేసుకోవాలిగా అందుకు... నోర్మూసుకొని

సంతకం చేయి" మండిపడుతూ అంది సుభద్రమ్మ.

"చేయకపోతే" నింపాదిగా అంది మాలతి.

"గొంతు పిసికి చంపేస్తాను" విసురుగా అన్నాడు శేఖర్.

"అలాగే కానివ్వండి. నేను సంతకం పెట్టను"

"ఎంత పొగరే నీకు" చెంప ఛెళ్లుమంది.

మాలతి చేతిలో ఊలు జారిపడింది. నిదానంగా కళ్ళెత్తి చూసింది.

"సంతకం పెడ్తావా? పెట్టవా?"

"పెట్టను"

శేఖర్ చేయి ఎత్తాడు. మాలతి అతని చేయి గట్టిగా పట్టుకుంది.

నలుగురూ అదిరిపడి చూశారు. వానపాములా నెమ్మదిగా కదుల్తూ... అణిగిమణిగి ఉండే మాలతిలో కనిపించిన ప్రతిఘటన వాళ్ళని ఓ క్షణం వణికించింది.

"అరేయ్... దీనికి పొగరెక్కువైంది. నువ్వు అణుస్తావా? నేను అణచనా? సుధా... వెళ్ళి కిరసనాయిలు డబ్బా పట్రా..." అరిచింది సుభద్రమ్మ.

మాలతి ఓ క్షణం ఆవిడవైపు చూసి చిరునవ్వు నవ్వింది. తరవాత మంచం కింద దాచిన కిరోసిన్ డబ్బా తీసి మూత తీసింది.

అందరూ నిశ్చేష్టులై చూస్తుండేలోగానే అందులో ఉన్న కిరసనాయిలు అందరి మీదా చల్లి తనమీద కూడా చల్లుకుంది.

"చూడండి... ఒక అగ్గిపుల్లతో నలుగురం సజీవ దహనం అవుతాం. రేపు పేపర్లో అగ్నిప్రమాదంలో మరణించిన కుటుంబం అని వార్త వస్తుంది. మీకేవన్నా అభ్యంతరమా?"

"ఒసేయ్....!" నలుగురూ వెర్రిగా అరుస్తూ మాలతి జుట్టు పట్టుకున్నారు. "మమ్మల్నే చంపుతావా! చూస్తా... అరేయ్ తాడు తీసుకురారా... ముందు దీన్ని కట్టేయ్" అరిచింది సుభద్రమ్మ.

వెనక తలుపులు ధడాల్న తెరుచుకున్నాయి.

మాలతి జుట్టు వాళ్ళ చేతుల్నించి అప్రయత్నంగా జారింది.

"కానిస్టేబుల్ వాళ్ళని అరెస్ట్ చేయి" ఎస్.ఐ ఆజ్ఞాపించాడు.

మాలతి ఎస్...ఐ ముందుకు నడిచి చేతులు జోడించింది. "సినిమాల్లోలాగా

కథ అయిపోయాక వస్తారనుకొన్నాను థాంక్స్ సార్... ముందే వచ్చారు."

నీలిమ పరుగెత్తుకొచ్చి మాలతిని వాటేసుకుంది.

"ఈరోజే వీళ్ళు నీ కథ ముగింపుకి ముహూర్తం పెట్టుకున్నారని నాలుగు తంతే చెప్పాడక్కా మీ లాయర్. పోలీసులు లాయర్ని ఏమీ చేయలేరు కదా! అందుకే నేను రంగంలోకి దిగాను. కాకపోతే పదివేలు అడిగాడు. తన్నులు తిన్నందుకు ఇస్తానన్నాను" నవ్వింది నీలిమ.

"మీరిద్దరూ స్టేషన్‌కి వచ్చి కంప్లైంట్ రాసివ్వండమ్మా..." ఎస్.ఐ అన్నాడు, సంకెళ్ళ మధ్య తలలు వంచుకుని నిలబడ్డ నలుగుర్ని తీసుకెళుతూ.

"అలాగే సార్... తప్పకుండా వస్తాం... అక్కా... ముందా కిరసనాయిలు బట్టలు మార్చుకో..." నీలిమ అంది.

"ఎస్.ఐ.గారూ! వాళ్ళని కొంచెం జాగ్రత్తగా తీసుకెళ్ళండి. పొరపాట్న ఎవరన్నా సిగరెట్ పీక మీద పడేస్తే పాపం వాళ్ళు తగలబడతారు" అంది మాలతి.

నలుగురు కళ్ళల్లో భయం. శేఖర్ కళ్ళల్లోని క్రోధం మాలతి పెదవులపైన గర్వంతో కూడిన చిరునవ్వు.

"మిస్టర్ శేఖర్! వానపాము కూడా కాటేయగలదని అర్థమైందా? కాలం ఎప్పుడూ ఒకరికే అనుకూలంగా ఉండదు. విష్‌యూ గుడ్‌లక్. వెళ్ళిరండి. సుధా! నిన్ను మాత్రం ఓ గంటలో బైటికి తీసుకొస్తాను. భయపడకు" హుందాగా నడిచి బాత్రూంలోకి వెళ్ళిపోయింది మాలతి.

సంకెళ్ళతో కానిస్టేబుల్ వెనకాల వెళుతున్న ఆ నలుగుర్ని చూసి జాలిగా నవ్వుకుంది నీలిమ. ఆడపిల్లలు కొంచెం అప్రమత్తంగా ఉంటే ఇలాంటి నరహంత కుల్ని ఎదుర్కోవడం చాలా సులువు... అమ్మాయిలూ బహు పరాక్.

***

*(జూన్ 2007, భూమిక)*